క్లుప్తంగా

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయ అష్టాదశ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు దుర్గాదేవి పంచామృత ఫలరస అష్టోత్తర కలాశాభిషేకం, 9 గంటలకు గణపతిపూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ స్థాపిత దేవాతా హవనం, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, మురళి, రామమూర్తి, కృష్ణమూర్తి, ప్రసాద్, కేశవులు, లక్ష్మయ్య, అర్చకుడు బాలమురళీశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత ఆలయ వార్షికోత్సవాలు

వనస్థలిపురం: సచివాలయనగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ అష్టమ వార్షికోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఆలయ చైర్మన్ వేముల జయరాములు, ఫౌండర్ చింతల రవికుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి వెంకటస్వామి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తడకమళ్ల విజయ్‌కుమార్, టి.రవికుమార్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మహేశ్వరం ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేఖర్



నియామక పత్రం అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్‌కే పురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన దుబ్బాక శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనను ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించిన మంత్రి సబితారెడ్డికి, పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలకు పాల్పడుతున్న యువకుడిపై రౌడీషీట్



షేక్ సఫియొద్దీన్

హస్తినాపురం: గంజాయి సేవించడంతో పాటు గంజాయిని ఇతరులకు విక్రయిస్తూ తరుచూ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న యువకుడిపై రౌడీషీట్ తెరిచిన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగింది. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి కథనం ప్రకారం... ఎల్‌బీనగర్ మసీద్‌లేన్, ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ సఫియొద్దీన్ (23) 2019 సంవత్సరం నుంచి నేరాలబాట పట్టాడు. గంజాయికి అలవాటుపడ్డ ఇతడు తక్కువ రేటుకు దానిని కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు విక్రయించేవాడు. గంజాయి మత్తులో అనేక నేరాలకు పాల్పడ్డాడు. ఇతడిపై ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు, చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు ఉన్నాయి. దాడులతో పాటు హత్యాయత్నం , మహిళలను వేధించడం కేసులతో పాటు అనేక నేరాలతో సంబంధం ఉన్న షేక్ సఫియొద్దీన్‌పై వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచామని సీఐ జలేంధర్‌రెడ్డి వెల్లడించారు.

వైభవంగా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవం

వాడవాడలా జాతీయ జెండా ఆవిష్కరణ

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ అమరులకు ఘన నివాళి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. కేక్‌లు కట్ చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు ఘన నివాళులర్పించారు. ఉద్యమకారులను సన్మానించారు. అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఎల్‌బీనగర్ సర్కిళ్ల కార్యాలయంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఈ నెల 22 వరకు ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే సంక్షేమ పథకాలు అమలులో అగ్రగామిగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీలు మారుతీదివాకర్ రావు, కృష్ణయ్య, మూడు సర్కిళ్ల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ పంకజ జాతీయ జెండాను ఎగురవేశారు.అనంతరం ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను అందజేసి సన్మానించారు.

– ఎల్బీనగర్, మలక్‌పేటజోన్ బృందం



ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



జోనల్ కార్యాలయంలో ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జోనల్ కమిషనర్ పంకజ



బీఎన్‌రెడ్డినగర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి



బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు



మన్సూరాబాద్‌లో... మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి



బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న సామ రంగారెడ్డి



మన్సూరాబాద్‌లో .. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



కొత్తపేటలో ఉద్యమకారులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేత వజీర్ ప్రకాష్‌గౌడ్



మూసారంబాగ్‌లో.. బీఆర్‌ఎస్ మలక్‌పేట ఇన్‌చార్జి ఆజమ్‌అలీ, మాజీ కార్పొరేటర్లు సునరితాఅజీత్‌రెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి



సలీంనగర్‌లో ... బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు పలు ప్రాంతాల్లో జాతీయ జెండాను ఎగురువేశారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది సోనియాగాంధీ, తెచ్చింది కాంగ్రెస్‌పార్టీ అని పేర్కొంటూ వారు తమ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. పార్టీ ఎల్‌బీనగర్ సమన్వయకర్త మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి



మలక్‌పేటలో పాలాభిషేకం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్



సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి

ఉద్యమానికి ఊపిరి పోసింది శ్రీకాంతాచారి: జస్టిస్ చంద్రకుమార్



ఎల్‌బీనగర్‌లోని శ్రీకాంత్‌చారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

మన్సూరాబాద్: మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిర పోసింది అమరుడు కాసోజు శ్రీకాంతాచారి అని తెలంగాణ ప్రజల పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని శ్రీకాంత్‌చారి విగ్రహానికి ఆయన పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అధ్యక్షుడు మరళీధర్‌గుప్తా, కార్యనిర్వాహక అధ్యక్షుడు లయన్ శ్యాంసుందర్‌రావు, నాయకులు కృష్ణారావు, ఇంద్రసేన్, సుదర్శన్, సత్తార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నర్స్ మర్డర్ కేసులో నిందితుడికి 2 రోజుల పోలీస్ కస్టడీ

సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయనున్న చైతన్యపురి పోలీసులు

చైతన్యపురి: డబ్బు లావాదేవీల నేపథ్యంలో దారుణ హత్యకు గురైన నర్సు అనురాధ కేసు మలక్‌పేట పోలీసు స్టేషన్ నుంచి చైతన్యపురి పీఎస్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. నిందితుడు చంద్రమౌళి ఆమెను అత్యంత దారుణంగా హతమార్చి తల మలక్‌పేటలో పడేసి, మిగిలిన శరీర భాగాలను తన ఇంట్లోనే ఫ్రిజ్‌లో దాచిపెట్టాడు. కాగా, చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగినప్పటికీ తల మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తీగలగూడలో లభ్యం కావటంతో ముందుగా కేసు అక్కడ నమోదైంది. చంద్రమౌళిని అరెస్ట్ చేసి మలక్‌పేట పోలీసులు అతడిని రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత తదుపరి విచారణ నిమిత్తం కేసును చైతన్యపురి స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు. నిందితుడిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటీషన్ వేయగా శని, ఆదివారాలు రెండు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో నిందితుడిని నేర స్థలానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తామని చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్ట్

చైతన్యపురి: చీటింగ్ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఓ నిందితుడిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ కథనం ప్రకారం.. ప్రైవేట్ చిట్టీల పేరుతో పలువురిని మోసం చేసిన మెట్టు విజయ్‌కుమార్, జె.శ్రీనివాసరెడ్డిలపై బాధితుల ఫిర్యాదు మేరకు 2018లో చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. అయితే బెయిల్‌పై బయటకు వచ్చిన ఇద్దరూ కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు వారిపై నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. కాగా, వీరిలో విజయకుమార్ చిక్కడంతో శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

సైదాబాద్‌లో యువకుడు...

సైదాబాద్: ఊరు వెళ్తున్నానని తల్లికి చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయాడు. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం... సైదాబాద్ శ్రీ టెంపుల్ వద్ద నివసించే బుగ్గా రాజేశ్వరి పెద్ద కుమారుడు బుగ్గా సుశాంక్ (23) చికెన్ వ్యాపారం చేస్తున్నాడు. మే 31న మధ్యాహ్నం అతడు విజయవాడకు వెళ్తున్నానని తల్లికి చెప్పి దుస్తులు, ఏటీఎం కార్డు, తన ద్విచక్ర వాహనం తీసుకొని వెళ్లాడు. సాయంత్రం అతను తన తమ్ముడు చంద్రదీప్ వాట్సాప్‌కు తాను విజయవాడకు కాదు.. మహారాష్ట్రకు వెళ్తున్నానని మెసేజ్ చేశాడు. దాంతో వారు అతడి కోసం ఫోన్ చేసినా ఫలితం లేదు. అతని మిత్రులు, బంధువులను విచారించినా సమాచారం తెలియరాలేదు. నెల రోజులుగా తన కుమారుడు మానసికంగా ఇబ్బంది పడుతున్నట్టు కనిపిస్తున్నాడని తల్లి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు గురువారం సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనస్థలిపురంలో వృద్ధురాలు...



నర్సమ్మ (ఫైల్)

హస్తినాపురం: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సాయిశ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న గార్లపాట నర్సమ్మ (80) గత నెల 31న సాయంత్రం వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు నర్సమ్మ ఆచూకీ కోసం తమ బంధువులు, స్నేహితులు, తెలిసిన వారివద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఎల్‌బీనగర్: ది సిటిజన్ కో ఆపరేటీవ్ సొసైటీ ఐదు రాష్ట్రాలలో 42 శాఖల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నదని సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బయ్య తెలిపారు. వనస్థలిపురం, సుభద్రానగర్ శాఖల సమావేశం శుక్రవారం శ్రీకన్వెన్షన్‌లో సొసైటీ చైర్మన్ రంగరాజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ, తమ బ్యాంక్ రూ.1863.49 కోట్ల డిపాజిట్లు, రూ.1606.33 కోట్ల అడ్వాన్సులతో, రూ.86.18 కోట్ల లాభాలతో రూ.34.70కోట్ల బిజినెస్ టర్నోవర్‌తో పురోభివృద్ధిలో ఉందన్నారు. డైరెక్టర్లు శ్రీనివాస్, సోమలింగం గౌడ్, వనస్థలిపురం మేనేజర్లు సరిత, శివరాజ్యం, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కంకణబద్ధులు కావాలి



ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్క పోలీసు కంకణబద్ధులు కావాలని, తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రజల మన్ననలను పొందాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన పి.శ్రీనివాస్, ఎం.వేణుగోపాల్, వి.సురేందర్‌రెడ్డి, ఏఎం ప్రసాద్‌లను సీఐ అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజీలేకుండా పని చేయాలన్నారు. అనంతరం వారిని సీఐ తోపాటు డీఐ వెంకట్, ఎస్‌ఐలు ఘనంగా సన్మానించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

చంచల్‌గూడ: పురుషులకు సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ అన్నారు. జన శిక్షణ సంస్థాన్ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సుల్లో మహిళలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఉత్తీర్ణులైన మహిళలకు శుక్రవారం కుర్మగూడ డివిజన్‌లో సహదేవ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై సర్టిఫికెట్లు అందజేశారు. జన శిక్షణ సంస్థాన్ సంచాలకులు నరహరి, మాలకొండయ్య, మంజుల, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బడిబాటకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 17వ తేదీ వరకు కార్యక్రమం
- సర్కారు బడుల్లో వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం
- కొత్త విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం ముఖ్య ఉద్దేశం



తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంపై ఉపాధ్యాయులకు వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

చాదర్‌ఘాట్: విద్యాశాఖ మలక్‌పేట పరిధి కిందకు వచ్చే ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలో ఉన్న రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని జూన్ 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రోజు ఒక్కో కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రలను చైతన్యపర్చాలని సూచించారు. 15 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులు ఆదేశించారు.

ఈ కార్యక్రమాలు చేపట్టాలి:

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులను మరింత సన్నద్ధం చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను తెలియజేయాలి.
- నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉచిత స్కూల్‌డ్రెస్సులు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు అందజేస్తున్న విషయాలను తల్లిదండ్రులకు తెలియజేయాలి. సర్కార్ బడులంటే వారిలో ఉన్న చిన్నచూపును దూరం చేయాలి.
- తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నమోదు శాతాన్ని పెంచడం
- ఐదు నుంచి 7వ తరగతి విద్యార్థులందరినీ ఉన్నత పాఠశాలలో చేర్పడం
- అంగన్‌వాడీ కేంద్రాలలో అయిదేళ్ల పిల్లలను గుర్తించి వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు కల్పించడం
- విద్యాపట్టికలు ఆధునీకరించడం
- జూన్ 3 నుంచి 9వ తేదీ వరకు బస్తీల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమం ఏర్పాటు చేయాలి.
- జూన్ 12 నుంచి 17వ తేదీ వరకు నిర్ధారించిన రోజువారీ కార్యక్రమాలు నిర్వహించడం.

ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలి

ప్రభుత్వ పాఠశాలలో డ్రాపౌవుట్లు లేకుండా చూడటం, కొత్తగా విద్యార్థులను బడిలో చేర్పుకోవడం లక్ష్యంగా జూన్ 3వ తేదీ నుంచి ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేశారు. సర్కారు బడుల్లో ఉత్తీర్ణ శాతం పెంచి విద్యార్థులను ఆకర్షించాలనే టాస్క్‌ను ఉపాధ్యాయులకు అప్పగించాం. ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరై ఇంటింటికీ తిరిగి బడిబాట కార్యక్రమంలో పాల్గొనాలి.

– డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి